
గ్లోబల్ హాస్పటల్స్- ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన సామాజిక కథ

# రైతుకోడి

మాచన్న సంజీవరెడ్డి



"కొక్కరకో... కో..."

కోడికూత కూయంగానే రామిరెడ్డి మేల్కాయిండు. రామిరెడ్డి లాంటి మరికొంతమంది మేల్కొయ్యింద్రు.

ఇప్పుడు చానా వూర్లల్ల కోడికూతలు విన్పిస్తలేవు. తుపాకి మోతలు విన్పిస్తున్నయి! కూసే కోళ్లు తగ్గి మేసే కోళ్లు పెరుగుతున్నయి!

తన మగడు చానా ఏళ్లనుంచి రామిరెడ్డిని మేల్కొలుపుతుండే. వయసయిపోయి, రోగం సోకి సచ్చిపోయిండు. గప్పటి సంది నా కొడుకే రామిరెడ్డిని ఊర్లె మిగిలిన చానామందిని మేల్కొలుపుతుండు.

రామిరెడ్డి పక్కమీదికెల్లి లేసి, చుట్ట వెలిగించుకొని, ముందు గనమ గొళ్లెం తీసి తలుపు దగ్గర కేసి బయటి ఆకిట్ల కొచ్చిండు.

మొగులు దిక్కుచూసి లైట్ల లెక్క మెరుస్తున్న చుక్కల్ని చూసి, 'గిదేం కాలం పోగాలం- ఆనకాలంల గీచుక్క లేంది?' అని గొనుక్కున్నడు. పశువుల కొట్టంలకు వొయ్యిండు. అతడ్ని చూడగానే ప్రేమగా తలలు ఎత్తి లేచి నిలబడ్డాయి.

ఒక్కోదాన్ని పేరుపేరున పలకరిస్తూ చేయితో దువ్వుతూ గడ్డామునుంచి (పేరుకే ఆము కానీ, వున్నది రెండు మోపులే) గడ్డిదెచ్చి అన్నిటికీ పలారం లెక్క పంచిండు.

జారాడు దగ్గరి గోలెంలనుంచి కడవతో నీళ్లు దెచ్చి తొట్లల్ల పోసిండు.

రామిరెడ్డి దినచర్య ఏందో తనకు బాగా తెల్సు. ఎన్నో ఏళ్లుగా ఆయనను చూస్తున్న- మనుషుల్ని ప్రేమించినట్లే గోజల్ని ప్రేమిస్తడు. కోళ్లకు గూళ్లు, గోజలకు కొట్టాలు, మనుషులకు ఇండ్లు కనీసం అవసరమని అంటాడు.



నీళ్లు, ఆహారం అన్ని జీవులకు ఒకే తీరుగ అవసరమని, ఆయన మాటలు చేతలు చెపుతాయి. జీవహింస, రాజ్యహింస తగవని ఆయన వాదిస్తాడు.

మాంసంకోసం కోళ్లు గోర్లు పెంచడం ఆయనకిష్టముండదు. లేయర్స్, బ్రాయిలర్స్ అని కోళ్లను పెంచడం - చంపడం వ్యాపారం చేయడం ఆయనకు నచ్చదు.

నేలతల్లి ఆయనకు దైవం. పంట మొక్కల్ని పసిడిలా చూసుకోవడం ఆయనకిష్టం.

కోళ్లతో పందాలాడటం అనాగరికం అంటాడు.

పొద్దు పొడిచింది. గూళ్లనుంచి మాకు స్వేచ్ఛ దొరికింది. ఎగురుతూ, ఎగిరెగిరి గంతులేస్తూ రామిరెడ్డి కాళ్ల ముందరకొచ్చాన్నేను.

నన్ను రెండు చేతులతో దగ్గరకు తీసుకుని నా కండ్లను చూసాడు. నేను కూడా ఆయనని చూసాను.

నల్లటిమనిషి - తెల్లగా మెరుస్తున్న కండ్లు. తలకు నిండుగా రుమాలు చుట్టి కోర మీసాలతో ముసలి రాజులా వున్నడు.

రెండుచేతులతో రెక్కల్ని దువ్వాడు. మెల్లింగా చెంపలకు ఆనించుకొని నేలమీదికి వదిలిపెట్టాడు.

ఇట్లనే రోజూ చేస్తాడు. ఈ నడుమనే మనిషిలో ఎందుకో మార్పు కనపడుతుంది.

మనిషి మనసులో ఏందో గుబులు, కండ్లల్లో ఏందో తెలియని దిగులు కనపడుతుంది.

కరువుకాలం. ఎండలు మస్తుగ కొడుతున్నయి. ఆనలు లేవు. చెరువులు - కుంటలు ఎండిపోయినయి. భూమిల నీళ్లు లేకుంటయినయి.

ఎన్ని బోర్లు తవ్వినా నీళ్లు పడతలేవు. పంట పొలాలు, బీళ్లుగా మారుతున్నయి. నీళ్లు లేక కోళ్లు కూడా అల్లల్లాడుతున్నయి.

❄ ❄ ❄

జూన్ నెల రెండవ వారం.

మృగశిర కార్తె రెండవ పాదంలోకి ప్రవేశించింది. ఎండాకాలానికి... వానాకాలానికి మధ్య గీత చెరిగిపోలేదు.

ఇంకా ఎండలు మండిపోతున్నాయి.

నీళ్లు దొరక్క నోళ్లు ఎండిపోతున్నాయి.

దొడ్లోంచి పశువులు అరవటం చేతకాక నీళ్లకోసం నోళ్లు తెరిచి చూస్తున్నాయి.


పక్షులు చెట్ల కొమ్మల చాటునుండి నేలకేసి కాకుండా ఆకాశం కేసి చూస్తున్నాయి నీటిని మోసుకొచ్చే మబ్బులు ఎక్కడైనా కానరాక పోతాయా అని!

పనీ - పాటా లేకపోవడంతో చాలామంది గుడి అరుగుమీద గుమికూడారు. అందరూ మాట్లాడుకుంటున్న మాటలు ఒకే విధంగా వున్నాయి -

"నాల్గు చినుకులు పడితే బాగుండు. తింటందుకు తిండి లేకున్నా బతకొచ్చుకానీ, నీళ్లు లేకుంటే బతుకుడెట్ల?!"

"ముందు నాగలి దున్నే ఎద్దుల్ని బతికించుకోవాలి. వానలుపడితే దున్నుకుంటందుకు ఎడ్లు లేకపోతే ఎట్లా?"

నేను రాసిన 'రైతుకోడి' కథకు ప్రోత్సాహక బహుమతి ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. నా పూర్తిపేరు మాదన్న సంజీవరెడ్డి. బియస్సీ, బి.ఎడ్. చదివిన నేను గత ఇరవై ఏళ్ల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నాను. పుట్టి పెరిగింది రంగారెడ్డి జిల్లా షామీర్‌పేటలో. నేను రాసిన మొదటి కథ 'ఉచ్చు' (16.4.1980) ఆంధ్రప్రభలో వచ్చింది. ఆనాటి నుంచి నేటివరకు ఆంధ్రప్రభ వీక్లీ నన్ను ప్రోత్సహిస్తూనే వుంది. పది కథలకు పైగా ఆంధ్రప్రభ వీక్లీలో అచ్చయినాయి. ఆంధ్రపత్రిక తానా సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో మొదటిసారి బహుమతి పొందాను. తర్వాత సాక్షి పక్షపత్రిక ప్రోత్సాహక బహుమతిని ప్రకటించింది.



నేను కథా రచన ప్రారంభించి చాలా ఏండ్లయినా రాసింది తక్కువే! ముప్పయి కథలు ఇప్పటివరకు వివిధ పత్రికల్లో అచ్చయినవి. అనేక సమస్యల వలన కథారచన ఆగి ఆగి సాగడమే దీనికి కారణం.

నా కథా గురువు నందిని సిధారెడ్డి. అతని కథలన్నా, కవిత్వమన్నా ఇష్టపడతాను. ఇటీవల వారు నిర్వహిస్తున్న 'సోయి'లో 'నీళ్లు' కథ వచ్చింది. త్వరలో కథా సంపుటి తీసుకు రావాలనే ఆలోచన ఉంది.

ఈ కథ 1995లోనే మొదలు పెట్టాను. అనివార్య కారణాల వలన మధ్యలోనే ఆపేసాను. అప్పటికీ ఇప్పటికీ రైతుల కష్టాలు మరింతగా పెరిగినందున, కరువు భయానక పరిస్థితిని తెచ్చినందున తిరిగి కథను పూర్తిచేసాను.

"ఊళ్లో బావుల్లో నీటి చుక్క లేదు. మైలు దూరం వెళ్లి వాగులోంచి నీళ్లు తెచ్చుడవుతుంది. పశువుల్ని అక్కడే కట్టేద్దామంటే - దొంగల భయం. మేత దక్కనిస్తలేరు. గడ్డిపోసల్ని, నీటి చుక్కల్ని జాగ్రత్తగా కాపాడుకుంటున్నం."

"ఇట్లనే నెలరోజులు కాలం పోతే భూమ్మీద జీవరాశి దక్కదు. మట్టి తప్ప మరేం మిగలదు."

పచ్చటి చెట్లతో, పాడిపంటలతో కళకళలాడవల్సిన వూళ్లు ఎడారులవుతున్నయి.

చెట్టూ - చేమా కరువై వర్షాలు పడక చెరువులు కుంటలు ఎండిపోయి పచ్చటి పొలాలు బీళ్లుగా మారుతున్నాయి.

మామూలుగా మార్చినెలనుండే నీటి కరువు మొదలవుతుంది.

అప్పటివరకు చెరువుల్లో, కుంటల్లో వున్న నీరు అడుగంటడంతో బావుల్లో వూటలు తగ్గి నీటి కొరత మొదలవుతుంది. పంటలు మధ్యలో ఎండిపోయే ప్రమాదమేర్పడుతుంది.

ఆ స్థితిలో వ్యవసాయదారులు తప్పనిసరై అప్పో సప్పోచేసి బావుల్లో పూడికలు తీయించడం, కొత్తగా బోరుబావులు వేయించడం చేస్తుంటారు.

అది మరింత నీటికొరతకు కారణమవుతుంది.

అయితే కూలీ చేసుకునే జనానికి బుక్కెడు బువ్వ దొరికేది అప్పుడే. పంటలు పండించే వారు సగంపూట వస్తులుండేది అప్పుడే!

రామిరెడ్డి తన నాల్గెకరాల వరిపంట ఎండిపోకుండా చూసుకోవడం కొరకు అప్పుచేసి ఒక బోరు తవ్వించాడు. రెండొందల ఫీట్లు తవ్వినా సరిపోయినన్ని నీళ్లు రాలేదు. ఖర్చు మాత్రం వచ్చింది.

ఖర్చుదేముంది పంట దక్కితేచాలు అనుకొని మరోచోట మరో బావి తవ్వించాడు. అప్పు పెరిగింది. నీరు పెరగలేదు.

ఎండిపోతున్న వరిపంట చూస్తున్నకొద్దీ రామిరెడ్డి మనసు గిలగిలా కొట్టుకుంది.

ఏమైనా సరే! ఎంత ఖర్చైనా సరే! పచ్చని పైరు ఎండి పోకూడదు. అనుకుని మరో బోరు వేయించేడు. నీరు పడ్లేదు.

వరి పంట మూడెకరాలు ఎండిపోయింది.

అప్పు అసలుతో కలిపి మంచి పంట పండింది!

రామిరెడ్డి మనసు చితికిపోయింది.

ఊళ్లో చాలా కుటుంబాలు రామిరెడ్డి కుటుంబం లాగానే చితికిపోయాయి.

పక్షులు వలస వెళ్లినట్లు వూళ్లోని చాలా కుటుంబాలు బతుకుదెరువు చూసుకుంటూ వలస వెళ్లారు.

కొందరు భూములు తనకా పెడితే, మరి కొందరు ఏకంగా అమ్ముకున్నారు.

కొందరు వూళ్లోనే వుంటే మరికొందరు వూరు విడిచారు.

రామిరెడ్డి కొడుకులు కూడా భూములు అమ్మేసుకుందామని శత పోరుతున్నారు.

కానీ, రామిరెడ్డి విన్పించుకోవడం లేదు.

నమ్ముకున్న భూమిని అమ్మకానికి పెట్టకూడదు. ఎప్పటికైనా వర్షాలు పడకపోవు. చెరువులు, కుంటలు నిండక పోవు. అప్పుడు తవ్వించిన బావులన్నింటిలోనూ నీరు పుష్కలంగా పడుతుంది. నీటి కరువు తీరుతుంది. పంట బరువుతో నేల తల్లి పులకరిస్తుంది. పాడి - పంటలకు కొదవుండదు. ఎప్పటికైనా మునపటి రోజులొస్తాయి. అనుకుంటూ జీవితంలో తను ఎన్ని కరువులో చూసింది ఏకరువు పెడతాడు.

ఏడేళ్ల వయసున్నప్పుడు కరవు ఎందర్నో బలి తీసుకుంటే తను మాత్రం తెలివిగా రేగడిమన్నును పెరుగులో ముంచుకు తిన్నానంటాడు.

కరవు రోజుల్లో పెరుగు ఎక్కడిది? అని ఎవరైనా అడిగితే పంటలు పండకపోవడం, నీట మునిగి పోవడం కరువుకాదా అని ఎదురు దాడి చేస్తాడు.

మా రోజుల్లో ఇంట్లోని చేదబావిలో నీళ్లు తోడేవారం కాదు. బిందెలతో, చెంబులతో ముంచుకునే వాళ్లం. ఆ రోజుల్లో కరవంటే నీళ్ల కరవుకాదు. అధిక వర్షంతో పంటలు చేతికి అందక కొంత, చీడపేడలతో పంటలు పండకపోవడంతో వ్యవసాయదారులు నష్టపోయేవాళ్లు.

అప్పుడు పాడి వుండేది. పంట వుండక పొయ్యేది. పాలు - పెరుగు మంచి నీళ్లలా ఖర్చుపెట్టేవాళ్లం.

మాకున్నన్ని పశువులు వూళ్లో ఎవరికీ వుండేవి కావు. దొడ్డి వదిలిపెడితే చివరి పశువు మొదటి పశువుకు మధ్య ఆమడదూరం

వుండేది.

ఊళ్లో అప్పుడు మనుషుల జనాభాకంటే పశువుల జనాభా అధికంగా వుండేది. ఇప్పుడు రెండెడ్లు వుంటే ఎక్కువాయే. వాటికే గడ్డిలేక నీరు లేక మిడుకుడాయే.

నా చిన్నతనంల ఇరవై నాగళ్లు కట్టేది. నాగలి ఎనుక నాగలి కట్టి పొలం దున్నుతుంటే అదో పండుగ.

నా పెళ్లికి యాభై కచ్చురాల నిండా జనం వచ్చారు. యాభై జతల ఎడ్లకు ఎంత మేత? గడ్డాము మొత్తం లేచిపోయింది.

ఎంత దానా ఖర్చు అనుకున్నరు - పల్లి పిండి, కొబ్బర అడిగి తీసుకునేవారు. లేదంటే జగడమే.

ఇప్పటిలా ఒకపూట పేండ్లిళ్లు కాదు. వారం రోజులు! అదో జాతర - అదో సంబరం!!

ఆ వారం రోజులు యాభై కచ్చురాలు, వంద ఎడ్లు - వందమంది పనివాళ్లు - చుట్టాలు పక్కాలు... మళ్లీ ఆ రోజులు రావు.

ఎక్కడికి పోయాయో ఆ పశువులు, ఏమై పోయాయో ఆ నీళ్లు?.... ఆ రోజులు మళ్లీ వస్తాయా...?

గట్టిగా నిట్టూర్పు విడిచాడు.

ఎనభై సంవత్సరాల వయసు అతనిది. అయినా జీవితం మీద ఆశ చావలేదు. మట్టిమీద ప్రేమ చావలేదు.

నల్గురు కొడుకులు - నల్గురు కూతుళ్లు ఆయనకు. కూతుళ్లను మంచి ఉన్నతమైన సంప్రదాయ కుటుంబాలకే ఇచ్చాడు. మంచి కుటుంబాల నుండి కోడళ్లను తెచ్చుకున్నాడు. ఎవరూ విడిపోకుండా ఉమ్మడి కుటుంబంగా జీవించేటట్టు అజమాయిషీ చేశాడు.

కానీ,

ఇప్పుడే ఈ కరువే తననీ - తనవారినీ వేరు చేస్తుందేమోనని బెంగ పట్టుకుంది.

రెండేండ్ల కిందటివరకు తనని తనవారిని ఒక్కతాటి మీద నడిపించిన తన జీవిత సహచరిణి మరణంతో కష్టాలు మొదలయ్యాయి.

ఇప్పుడు కోడళ్లు కొడుకులకు ఏం నూరిపోస్తున్నారో తన మాటలు వినటం లేదు. ఒకరు తూర్పు, ఒకరు పడమర. దిక్కుకొకరు చొప్పున అన్నట్టు ప్రవర్తిస్తున్నారు.

నీళ్ల కరువు వలన పంటలు ఎండి పోకూడదని బోర్లు తవ్వించినందుకు, పూడిక తీసినందుకు అప్పులు చేయాల్సి రావడం కొడుకులందరికీ తనమీద కోపం తెప్పించింది.

ఎవరిది వారికి పంచిస్తే అమ్ముకొని వచ్చిన సొమ్ముతో నాల్గు రోజులు జల్సా చేస్తరు. తర్వాత రోజు కూలీలుగా మారతరు. భూమి వుంది కనుక ఎవరైనా అప్పిస్తున్నరు. పంటలు పండించి కడుపుకింత తింటున్నరు. గుట్టుగా పరువుగా బతుకుతున్నరు. ఈ భూమి కాస్త అమ్మేస్తే పైసా అప్పు పుట్టదు.

నీటికి కరువు వచ్చిందని సి.ఎమ్. కూడా వరిపైరు వేయొద్దంటాడు. అందరూ అట్లానే చేస్తే తినడానికి అన్నం ఎక్కడనుండి వస్తుంది?!

ఐ.టి. మీద పెట్టుబడులు - ఎన్నారైలకు ఆహ్వానం అంటాడు. పేద రైతులు కంప్యూటర్లు తిని బతుకుతారా?!

చెరువెండినప్పుడు చేపలు గిలగిల కొట్టుకున్నట్టు జరుగుతున్న మార్పులు రామిరెడ్డి మనసును కల్లెరంబుల్లెరం చేస్తున్నయి.

❄ ❄ ❄


**గ్యాస్ట్రో ఎలర్ట్!**

ఎలాంటి బాధలు లేని ఉదరం మీకు ఎంతో అవసరం

**ఈ క్రింది రుగ్మతలతో మీరు బాధపడుతున్నారా ?**

- ఛాతిలో మంట
- కడుపు నొప్పి
- పచ్చ కామెర్లు
- ఆకలి మందగించడం
- బరువు తగ్గిపోవడం
- మలబద్ధకం
- అతిసారం (డయేరియా)
- బహిర్మార్గంలో నొప్పి

ఉదరం
కాలేయం
కిడ్నీ
బోన్‌మ్యారో (మూలుగ)
ప్యాంక్రియాస్



ఆహారం మింగడంలో నొప్పిగా అనిపించినా, వాంతులలో రక్తం కనిపించినా, మలంలో రక్తం పోతున్నా .. .. ..

**తక్షణమే మీరు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టును సంప్రదించండి**

EMERGENCY 24 Hrs. SERVICE

**ఎన్నో ప్రత్యేకతలు కలిగినది గ్లోబల్ హాస్పిటల్స్**

- అధునాతన ఎండోస్కోపీ సౌకర్యాలు
- అత్యాధునిక డయాగ్నొస్టిక్, ఇమేజింగ్ సౌకర్యాలు
- సుశిక్షితులైన స్పెషలిస్టు డాక్టర్లు రోజంతా అందుబాటు

**గ్యాస్ట్రో చెకప్‌లో చేసే పరీక్షలు**

- పూర్తి రక్తపరీక్ష (సి.బి.పి) • ఇ.ఎస్.ఆర్
- మలపరీక్ష (సాధారణ) • మలపరీక్ష (రక్తం)
- యుజిఐ ఎండోస్కోపీ • అల్ట్రా సౌండ్-అబ్డోమిన్
- లివర్ ఫంక్షన్ టెస్ట్ (ఎల్.ఎఫ్.టి) • నిపుణులతో సంప్రదింపులు

EXCELLENCE THROUGH TEAM WORK

**సంప్రదించండి ఫోన్ : 23234567**

అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలకోసం ప్రత్యేకంగా దేశంలోనే ప్రప్రథమంగా ఏర్పాటైన గ్లోబల్ హాస్పిటల్స్ ఇప్పటికే కాలేయం, మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు ఎన్నో విజయవంతంగా చేసింది.

గుర్తింపు :
ఇ.ఎస్.ఐ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎ.పి. ట్రాన్స్‌కో,
ఎ.పి.జెన్ కో, సి.పి.డి.సి.ఎల్ బి.డి.ఎల్, ఎన్.ఎం.డి.సి

**గ్లోబల్ హాస్పిటల్స్**

సి.జి.హెచ్.ఎస్, ఆరోగ్య భద్రత, దక్షిణమధ్య రైల్వే,
సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజి, లివర్ డిసీజస్, రీనల్ డిసీజస్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, కోలోరెక్టల్ సర్జరీ, అంకాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్

లకడీకాపూల్, హైదరాబాద్ - 500 004 ఫోన్: 040 - 23244444 (10 లైన్లు) ఫ్యాక్స్ : 23244455 వెబ్ సైట్ : www.theglobalhospital.com

TIME & SPACE

గొడ్డూ, గోదా తోలుకొని కొందరు ఇన్నాళ్లూ బతికిచెడ్డ వూరిని తలచుకుని కుములుతూ అమ్ముకోవటానికి అంగడికి వెళుతున్నారు.

కూలీ నాలీ చేసుకునే మరికొందరు తట్టా - బుట్టా సర్దుకుని పనికోసం పట్నం వెళుతున్నారు.

డబ్బు - పలుకుబడి వున్న ఒకరిద్దరు రైతులు అక్కడక్కడా అధిక ధరకు గడ్డికొనితెచ్చి పాడి పశువుల్ని పనిచేసే ఎడ్లను బతికించుకుంటున్నారు.

రామిరెడ్డి కొడుకులు తండ్రిని ఎదిరించలేక పెళ్లాల మాటలు కొట్టి పారెయలేక లోలోపల కోపంతో పళ్లు పటపట కొరుకుతున్నారు.

"ఈ పూటకు వంట చేయాలంటే తవ్వెడు బియ్యం కూడా లేవు. ఏం చెయ్యమంటారు మామయ్యా?" మొగురం చాటు చేసుకుని ఇంటి పెద్ద కోడలు బెరుకు బెరుకుగా మెల్లిగా వినీ విన్పడనట్టుగా అంది.

"అదేందమ్మా?! నెలరోజులైనా కాలేదు. పుట్టెడు వడ్లు మిల్లుకు పంపి. నాలుగు సంచుల బియ్యం ఇంటికి తెస్తిగద!" ఆశ్చర్యంతో నొసలు చిట్లించి ఎదురు ప్రశ్నించాడు రామిరెడ్డి.

"ఇంట్లకు ఏడాదికి సరిపడా పప్పు - ఉప్పూ, నూనె - ఉల్లిగడ్డ, మామిడి కాయ తొక్కుకు సరిపోయె. దినుసులు కొనడానికి మూడు సంచుల బియ్యం అమ్మేసిండు మీ కొడుకు. మిగిలిన సంచి బియ్యం ఈ రోజుతో ఖాళీ అయ్యింది" అంది కోడలు.

"మరి బియ్యం గురించి కూడా నీ మొగుడ్నే అడుగు" విసుక్కున్నాడు రామిరెడ్డి.

ఇన్నాళ్లు కొడుకులు తనకు తెలియకుండా ఏదీ చేయకపోయేవారు. ఇంట్లోకి చుట్టాలొచ్చినా కూర - నార కోసం తననే అడిగేవారు. ఇంట్లో ఎప్పుడూ బియ్యం నిండుకోవడం జరుగలేదు.

నేలతల్లి మీద దేవుడు పగబట్టిండు.

కన్నతండ్రి మీద కొడుకులు పగబట్టిండ్రు.

ఇన్ని దినాలు వానాకాలం రాంగనే నెలకు మూడువానలు కురిపించే దేవుడు, ఇప్పుడు మృగశిర దాటుతున్నా ఒక్క వాన కురిపిస్తలేడు.

గట్లనే ఇన్ని దినాలు తనమాట దప్పని కొడుకులు, ఒక్క మాటమీదున్న కొడుకులు - కరువు కాలం వచ్చిందని వున్న భూమిని అమ్ముకోవాలని నేల తల్లికి, కన్నతండ్రికి ద్రోహం తలపెడుతుండ్రు.

దొడ్లో పశువులు ఆకలి దప్పికతో 'అంబా!' అని అరుస్తుంటే లేచి అటువేపు వెళ్లాడు.

గడ్డాములోంచి ఒక మోపు గడ్డిని పిడికెడు పిడికెడు చేసి అన్నింటికీ పంచాడు.

రామిరెడ్డిని ప్రేమగా చూస్తూ తోకలాడించాయి. నాలుకతో చేయిని నాకబోయాయి. కానీ, గడ్డి పరకల్ని నోట్లోకి తీసుకోలేదు.

రామిరెడ్డికి పశువులన్నీ దప్పికతో నీళ్లకోసం దేవులాడుతున్నాయని అర్థమయ్యింది.

జారాడులోకిపోయి గోలెంల వున్న నీళ్లను కడవతో తెచ్చి నీళ్ల తొట్టె నింపి పశువుల్ని వదిలాడు.

అవినీళ్లు ఆబగాతాగి గడ్డిపరకల్ని తింటుంటే - తన ఆకలి తీరినట్టుగా మురిసిపోయాడు.

ఈ రోజుల్లో కూడా ఉమ్మడి కుటుంబపు పెద్దగా ఒక్క తాటిమీద కొడుకుల్ని నడిపించడం గొప్పగా చెప్పుకుంటారు చుట్టుపక్కల పదూళ్లలో రామిరెడ్డి గురించి.

పెళ్లయిన మర్నాడే వేరు కుంపటి పెట్టే అనేక కుటుంబాల పెద్దలు రామిరెడ్డి కుటుంబాన్ని చూసి నేర్చుకోండని సలహాలిస్తుంటారు.

అటువంటి రామిరెడ్డి కుటుంబానికి పూట గడవడానికి అప్పుగా సోలెడు బియ్యమైనా, తవ్వెడు బియ్యమైనా ఎవరిస్తారు...? సిగ్గువిడిచి నోరు తెరిచి అడగనూ లేరు.

భూమిని నమ్ముకున్నందుకు బుక్కెడు బువ్వకు కరువొచ్చిందని కుమిలిపోతున్నాడు రామిరెడ్డి.

తనుకూడా అందరిలెక్క 'ఎగుసం ఎలుగబెట్టకుండా నాలుగు బేపారాలు చేసుకుంటే ఇట్ల వుండకపోవునేమోనని ఆలోచన షురు జేసిండు.'

తనకన్న అన్నింట్ల తక్కువ వున్నోళ్లు. తక్కువ భూమి జాగలున్నోళ్లు పట్నం బోయి బాగుపడిన వైనం గుర్తుకు రాబట్టింది.

సందుల పెంటరెడ్డికి ఏముండే? ఏమి లేకుండే అడ్డెడు సోలెడు బదులు కావాల్నని ఎంబడి బడుతుండే. ఓ పూట తింటే ఓ పూట తినకపోతుండే.


ఎకరం కుష్కి, చెరువుకింద అద్దెకురం తరి వుండేది. వాని కొడుకుని కనా కష్టం మీద సదివించిండు. వాడు ఫెలయ్యి తండ్రి చెవిల జోరీగలెక్క లొల్లి పెడుతుంటే అయినకాడికి అమ్మి పట్నంల కిరాణా షాపు పెట్టించిండు.

ఆ షాపు మీద వచ్చిన దాంతోనే మెల్లి మెల్లింగ వాడు అక్కడ్నే ప్లాటు కొని ఇల్లు కట్టిండు. పక్కనే షెట్టర్ వేసి సిమెంట్ అండ్ స్టీలు షాపు దెరిచిండు.

ఇప్పుడు వాడు మొనగాడయ్యిండు. కారు కొనుక్కుని కాలరెగరేసుకుని తిరుగుతుండు.

బొక్కరాజిరెడ్డి కేముండే. తినవోతే తిండి లేకుండే. పండగకో, పబ్బానికో బొక్క కొరుకుతుండే. తుంగ మొలవని తొండలు గుడ్లు పెట్టే నాల్గెకరాల చెల్కుండే. ఎవడేమి చెప్పిండో - ఎడ్డోని లెక్కుండెటోడు. ఎప్పుడు ఏడుస్తున్నట్టు మాట్లాడెటోడు ఆయింత నాల్గెకరాలు అమ్మేసి వూర్లెనే వైన్‌షాపు దెరిచిండు. మంచి గిరాకట. ఏడ్పు గీడ్పు అంత వొయ్యింది. తెల్లబట్టలేసుకుని నవ్వుకుంట మోటార్ సైకిలెక్కి తిరుగుతుండు.

వచ్చే ఎలక్షన్ల ఓ.సి. సీటయితే సర్పంచికి



పోటీ జేస్తడంట!

నీళ్లు లేక గోజలు సస్తుంటే వీడు చీపులిక్కరు పోసి మనుషుల్ని జంపవట్టే.

'ఎవడు చస్తేంది - మనం బతికితే చాలు అనుకున్నోందే రాజ్యమయ్యింది.

మాడసాని రాజమ్మకేముండే - చిన్నతనాన్నే మొగుడు జచ్చి మొద్దొలుండే. సంటిపోరల్ని ఎట్ల సాకిందో - ఏ ఇంటికొస్తే ఆ ఇంట్లనే ఇంత పనిజేసి బుక్కెడు బువ్వ తిని పిల్లలకు వెడుతుండే.

తను సూడలేక వున్న రెండెకరాల పొలం కౌలుకు దీసుకొని - 'పటేండ్ల పిల్లవు. గిట్ల ఆనింటికి ఈనింటికి తిరిగితే ఇజ్జత్ వోతది' అని చెప్పి సంచి జొన్నలు రెండు సంచుల వడ్లు ఇచ్చి పంపిండు.

జొన్నలు మంచిగ బరబటిస్తుండే. మొకం మొద్దోలున్నా గట్క కమ్మగ జేస్తుండే. పిల్లలకు చల్ల పోస్తే గట్కతో కలిపి మంచిగ తినిపిస్తుండే.

అటువంటిది ఆ రెండెకరాలు తనకే అమ్మేసి ఇంటి పెరట్లో కొట్టం వేసి ఫారమ్ కోళ్లు పెట్టింది. ఒక్కతే కష్టపడి గట్క చేసిన అనుభవంతోని మొక్కజొన్నలు బరపటిచ్చి దానా తయారుచేసేది. బ్రాయిలర్స్ కూడా పెట్టి మంచి లాభాలు తెచ్చుకుంది.

పిల్లలను మంచిగ సదివిచ్చింది. ఐ.టి. చేయించి పెద్దోడ్ని అమెరికా పంపింది.

అందరూ తన కళ్లముందర్నే బాగయ్యిండు. ఎగసం నమ్ముకున్నోడే ఎందుకు పనికి రాకుంటయ్యిండు.

'... ఏటికెగుసం బెట్టి ఎయి పుట్లు పండిచ్చి ఎన్నడూ మెతుకెరుగరన్నా...' ఎక్కడో మూలకు పడ్డ రేడియోలోంచి సన్నగా పాట విన్పడుతుంది.

ఎన్నడూ లేంది తను గట్ల ఆలోచిస్తున్నడేంది? పోరలు తొవ్వ దప్పుతుంటే - తను సరిజెయ్యాలెగని - గిదేంది?

ఎనభై ఏండ్లల్ల తను కొత్త తొవ్వ దొక్కాల్ననుకుంటుండా!?

అర్థం గాకుంటయ్యి నెత్తిని రెండు చేతులతో పట్టుకుని వత్తుకుండు గట్టిగా.

ఏదో గుర్తుకొచ్చినట్టు గబుక్కున లేచి ఇంటెనుక గనుమదాటి దొడ్లెకు పొయ్యిండు.

❄ ❄ ❄

ఎండవేడికి ఓపలేక కోళ్లు నీడ పట్టున అక్కడక్కడ గుంపులు గుంపులుగా మట్టిని కాళ్లతో కెలుకుతూ, రెక్కల మీదికి మట్టిని పోసుకుంటూ సేదదీరుతున్నాయి.

నీళ్లు లేక కొన్ని నోళ్లు తెరిచి ఆపసోపాలు పడుతున్నాయి.

గోలెంల వున్న నీళ్లు అడుగుకు చేరడంతో నీటిని తాగడానికి అందులోకి దూకి మళ్లీ పైకి ఎగర లేక ఎగరలేక తల్లెడ ముల్లెడ పడుతున్నయి కోడిపిల్లలు.

రాంరెడ్డి అక్కడికొచ్చి పైకి ఎగరడానికి వాటికి సహాయపడ్డాడు. కొన్ని నీళ్లు గోలెం నుండి తీసి అక్కడక్కడ మూకుడ్లలో పోసాడు.

నాగలి దున్నే ఎడ్ల వద్దకుపోయి వాటి మెడలు దువ్వి మెడనుండి పగ్గాలు వదులు చేశాడు.

చవుటబావి దగ్గర వేసిన బోరుబావి నుండి ఆగి ఆగి వచ్చే నీళ్లు గోలెంల పడుతున్నయి.

ఈ కరువుకాలంల అవి పశువులు తాగడానికి కూడా సరిపోతలేవు. కోళ్లకు నీళ్లు దొరుకుడు కష్టమే అయితుంది. చిన్న చిన్న కోడి పిల్లలు నీళ్లు అందక చచ్చిపోతున్నయి.

ఇప్పుడంతా ఫారమ్ కోళ్ల వేపు మొగ్గు చూపుతున్నా రామిరెడ్డి మాత్రం ఇంకా నాటు కోళ్లనే ప్రేమగా పెంచుకుంటున్నాడు.

కోళ్లక్కూడా ముద్దుగా పేర్లు పెట్టుకుంటాడు. తెల్లకోడి, చుక్కలకోడి, ఎర్రకోడి -

తనను ఎన్నో ఏళ్లుగా ఈ ఇంట్లో రామిరెడ్డి ప్రేమగా పెంచుకుంటున్నాడు. తన సంతానమే ఇదంతా. గుడ్లు పెట్టడం ఆగిపోయినా తనను తక్కువగా చూస్తలేడు. కోడికూతతో లేసి పొద్దుపోయే వరకు కష్టపడే కష్టజీవి.

.... అరే ఎడ్లను ఎక్కడికో తోలుకుపోతుండు. అంగడికేమో - అయ్యో! ఇప్పుడు కరువొచ్చిందని, అందరి లెక్కనే ఆలోచన చేస్తున్నట్టుడు. ఇంట్లో తిండికి బియ్యం లేవని ఎడ్లను అమ్ముకుంటుండంటే - ఇగ అందరి లెక్కనే భూమిని బేరం పెడతడేమో -

ఇగ తనని చూసే దెవరు? ... తన జాతికి రక్షణ ఎవరు??

ఊళ్లకు వూళ్లే ఖాళీ అయిపోతుంటే ఫారమ్ కోళ్లు బతికేది ఉత్తదే.

.... తనకొడుకు కూత విన్పడత లేదు. నీళ్లు లేక, కూత రాకపోతుందా? కోడికూత మానవజాతికి మేల్కొలుపు కదా!

నాలుక తడారిపోతుంది. నీటి చుక్క ఎక్కడా లేనట్టుంది. అయినా రామిరెడ్డిని బతికించుకోవాలి. ఆయన్ను బతికించుకునే వాళ్లను మేల్కొలపాలి.

క్కో... క్కో... క్కో... గట్టిగా భయంగా అరుస్తూ బెదురుతూ రామిరెడ్డి కాళ్లకు అడ్డం పడ్డాను.

ఎడ్లు రెండు బెదిరి రామిరెడ్డి చేతుల్లోంచి పగ్గాలు లాక్కొని ఎడమకోటి, కుడికోటి పరిగెత్తాయి.

అప్పుడే వాటి కాళ్ల మధ్యన నలిగిన నేను ప్రాణం పోగొట్టుకుంటూ గిలగిలా కొట్టుకుంటుంటే రామిరెడ్డి నన్ను ఆత్రంగా అందుకోవడం కొంచెం కొంచెంగా తె....లు....స్తు....ం...ది....

■

**ఎక్స్‌పోజింగ్‌ను వ్యతిరేకించను. కానీ...!**

ఈ మాటలన్నది లారాదత్త. 'అందాజ్, ముంబయి సే అయా మేరా దోస్త్' చిత్రాల్లో చేసింది లార. 'అందాజ్'లో చక్కని ఎక్స్‌పోజింగ్ చేసింది. "ఆ చిత్రంలో గ్లామరంతా పాటలతో వచ్చిందే. అది ఇద్దరు అందగత్తెల చిత్రం కనుక దానికి అలాగే పబ్లిసిటీ ఇచ్చారు. 'ముంబయి సే అయా మేరా దోస్త్'లో 'సైయా...' పాట కూడా మత్తెక్కించే ట్రైవులోనే వుంది. మోడర్న్ డ్రెస్సుల్లోనే హీరోయిన్లు కనువిందు చేస్తారనే అపప్రథను ఈ పాట ద్వారా తొలగించారు దర్శకనిర్మాతలు. ఇందులో పూర్తిగా గ్రామీణవేషధారణ వుంది. నేను ఎక్స్‌పోజింగ్‌ను వ్యతిరేకించను కానీ, పాత్రను బట్టి, అవసరమైతే దర్శకుడు చెప్పినట్లుగా చేస్తా!" అంటున్న లార, మరో మూడు చిత్రాల్లో చేస్తున్నది.

